బీఆర్ఎస్ 'భద్రాచలం' కమిటీలు రద్దు

భద్రాచలం, అక్టోబర్ 30: బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గానికి సంబంధించిన అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రకటించారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన చేశారు. కార్తీకమాసం తొలి సోమవారం 4వ తేదీన భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాలకు కొత్త కమిటీలను వెల్లడించనున్నట్లు తెలిపారు.

నేరాల నియంత్రణపై దృష్టి సారించండి

సమీక్ష నిర్వహిస్తున్న పాల్వంచ డీఎస్పీ

అశ్వారావుపేట, అక్టోబర్ 30: నేరాల నియంత్రణపై అధికారులు మరింత దృష్టి సారించాలని పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్ కుమార్ అన్నారు. నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నేరాలు, రికవరీ, సీసీ కెమెరాల నిర్వహణపై ఆరా తీశారు. సీఐ కరుణాకర్, ఎస్సైలు యయాతి రాజు, శివరామ కృష్ణ, కిషోర్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన' కార్మికుల ఆందోళన

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 30: మధ్యాహ్న భోజన కార్మికులు తమ బిల్లులను వెంటనే చెల్లించాలన్న డిమాండుతో బుధవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీసీ నోట్‌బుక్స్ పంపిణీ

భద్రాచలం, అక్టోబర్ 30: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఐటీసీ నోట్ బుక్స్‌ను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బుధవారం పంపిణీ చేశారు. కళాశాల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ జాన్‌మిల్టన్, ఐటీసీ అడ్మిన్ మేనేజర్ చెంగల్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ హవీలా, సీపీడీసీ సెక్రటరీ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుపై అవగాహన సదస్సులు

బూర్గంపహాడ్, అక్టోబర్ 30: మండలంలో రైతులు మునగ సాగుపై ఆసక్తి చూపాలని ఎంపీడీవో జమలారెడ్డి కోరారు. మండలంలోని లక్ష్మీపురం, ముసలిమడుగు, సారపాక పంచాయతీల్లో బుధవారం గ్రామ సభల్లో మునగ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో 400 ఎకరాల్లో మునగ సాగు చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మునగ సాగుతో లాభాలు పొందవచ్చని, పెట్టుబడి ఖర్చులు తక్కువగా ఉంటాయని చెప్పారు. ఈజీఎస్ ద్వారా విత్తనాలను, మొక్కలను ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి, ఏవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పినపాక అభివృద్ధికి నిధులు ఇవ్వండి

-సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే పాయం వినతి

బూర్గంపహాడ్, అక్టోబర్ 30: పినపాక నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో బుధవారం సీఎంను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. కరకగూడెం మండలంలో పులుసుబొంత ప్రాజెక్టు, అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం, మణుగూరు మండలంలో రేగులగండి చెరువు, పేరంటాలచెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి లడ్డూ ప్రసాదాన్ని సీఎంకు పాయం అందించి, శాలువా కప్పి సత్కరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జీసీసీ మేనేజర్ పాపారావు

దమ్మపేట, అక్టోబర్ 30: మండలంలోని దమ్మపేట, జగ్గారం, మొద్దుల గూడెం, గండుగుల పల్లి, గణేష్‌పాడు, మల్కారం, మందల పల్లి గ్రామాల్లో జీసీసీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మేనేజర్ పాపారా బుధవారం ప్రారంభించారు. క్వింటా ఏ-గ్రేడ్ రూ.2320, కామన్ రకం రూ.2300కు కొననున్నట్లు వివరించారు. వారం రోజుల్లో రైతు ఖాతాల్లో మద్దతు ధర నగదు జమ అవుతుందన్నారు.

ప్రతిమల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 30: సింగరేణి సంస్థ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రతిమలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ చెప్పారు. ప్రతిమల ఏర్పాటుకు మండలంలోని కరెంటాఫీస్, కారేపల్లి ఎక్స్ రోడ్ స్థలాలను బుధవారం పరిశీలించారు. డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు జల్లులు

అన్నపురెడ్డిపల్లి: ధాన్యం బస్తాలపై పరదాలు

అశ్వారావుపేట రూరల్/అన్నపురెడ్డిపల్లి/బూర్గం పహాడ్, అక్టోబర్ 30: అశ్వారావుపేట రూరల్, అన్నపురెడ్డిపల్లి, బూర్గం పహాడ్ మండలాల్లో బుధవారం వర్షపు జల్లులు కురిశాయి. మెట్ట పంటలకు ఈ వర్షం ఊపిరి పోసిందని కొందరు రైతులు ఆనందపడుతుంటే.. వరి దెబ్బతింటుందేమోనని మరికొందరు రైతులు బాధపడుతున్నారు. కోసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పారు.

APGVB ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్
అశ్వారావుపేట బ్రాంచి-4129, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

స్వాధీనతా ప్రకటన (లాంఛనముగా)
(స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు చట్టంలోని సెక్షన్ 13(2)తో చదువబడే మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3 క్రింద సంక్రమించిన అధికారములు వినియోగించుకుంటూ **ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, అశ్వారావుపేట బ్రాంచి** అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు సదరు నోటీసు అందిన తేదీ నుంచి 60 రోజులలోగా **ది.04.07.2024 నాటికి** చెల్లించవలసిన బకాయిసొమ్ము **రూ.10,54,425/- (అక్షరాల పది లక్షల యాభై నాలుగు వేల నాలుగు వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే)** + వడ్డీ మరియు ఖర్చులు తిరిగి చెల్లించవలసిందిగా **రుణగ్రహీత: శ్రీ రాచూరి వెంకట సతీష్ చౌదరి, తండ్రి:** సుబ్బారావు, హెచ్.నెం. 15-56/4, అశ్వారావుపేట గ్రామము, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. **1) హామీదారు: శ్రీ ఉండవల్లి సత్యనారాయణ, తండ్రి:** వెంకన్న, వేదాంతపురం గ్రామము, అశ్వారావుపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. **2) హామీదారు: శ్రీ ముమ్మారెడ్డి సూర్యారావు,** వేదాంతపురం గ్రామము, అశ్వారావుపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. **అకౌంట్ నెం: 73124231016** వారిని కోరుతూ **ది.04.07.2024 తేదీగల డిమాండ్ నోటీసు** జారీచేశారు.

రుణగ్రహీతలు / గ్యారంటార్లు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములు వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని క్రింది సంతకందారు **25 అక్టోబర్ 2024న స్వాధీనం చేసుకున్నారని** రుణగ్రహీతలు / గ్యారంటార్లు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బ్యాంకు వారికి **ది.04.07.2024 నాటికి** చెల్లించవలసిన బకాయిసొమ్ము **రూ.10,54,425/- (అక్షరాల పది లక్షల యాభై నాలుగు వేల నాలుగు వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే)**+ వడ్డీ మరియు ఖర్చులు మొ॥నవి **ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్** (APGVB) వారి ఛార్జీకి లోబడి ఉండునని ఇందుమూలముగా ప్రత్యేకించి రుణగ్రహీతలకు / గ్యారంటార్లకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

షెడ్యూలు యొక్క ఆస్తి

సర్వే నెం.1342, 1343, 1344/A, **విస్తీర్ణము:** 220 చ॥గ॥, **క్లాసిఫికేషన్:** ఇంటి స్థలము (ప్లాట్ నెం. 41), **లొకేషన్:** అశ్వారావుపేట రెవెన్యూ గ్రామము, అశ్వారావుపేట మండలం, ఖమ్మం జిల్లా. **సరిహద్దులు: తూర్పు:** 33 అ॥ వెడల్పుగల రోడ్డు; **దక్షిణం:** ప్లాట్ నెం.40; **పడమర:** ప్లాట్ నెం.27; **ఉత్తరం:** ప్లాట్ నెం.42.

తేది : 25.10.2024 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : అశ్వారావుపేట — ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్

'విద్యుత్' విజయోత్సవం

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు

ఇల్లందు, అక్టోబర్ 30: రాష్ట్ర ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18,500 కోట్ల విద్యుత్ భారాన్ని మోపాలని చూసిందని, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు జడిసి వెనక్కు తగ్గిందని మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, నాయకుడు దిండిగాల రాజేందర్ అన్నారు. ఇది ముమ్మాటికీ బీఆర్ఎస్ సాధించిన విజయమని అన్నారు. ఇల్లెందులోని జగదాంబ సెంటర్‌లో బుధవారం దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు 'విద్యుత్ విజయోత్సవాన్ని' జరుపుకున్నారు. జగదాంబ సెంటర్‌లోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ మాట్లాడుతూ.. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఛిన్నంగా, అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ భారం మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిందని విమర్శించారు. దీనిని ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ వ్యతిరేకించిందని, ఈఆర్సీని ఒప్పించి, ప్రజలపై భారం పడకుండా ఆపగలిగిందని చెప్పారు. నాయకులు సిలివేరు సత్యనారాయణ, లకావత్ దేవీలాల్ నాయక్, జేకే శ్రీను, పరుచూరి వెంకటేశ్వర రావు, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, దాస ప్రమోద్, అజ్మీర బావుసింగ్, ఎండి.జబ్బార్, గిన్నారపు రాజేష్, సాతాల హరికృష్ణ, రాచపల్లి శ్రీను, నారపాక వసంతరావు, కాసాని హరిప్రసాద్ యాదవ్, రవితేజ, ప్రవీణ్, ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచలేదని చెప్పారు. దీనికి వీరస్వామి, మల్సూర్, కొప్పు సరిత, నెమలి ధనలక్ష్మి, చంద్రావతి, మంగ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో..

మణుగూరు టౌన్, అక్టోబర్ 30: మణుగూరలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. వారందరికీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మిఠాయిలు పంచిపెట్టారు.

పాల్వంచలో సంబురాలు..

పాల్వంచ, అక్టోబర్ 30 : పాల్వంచలో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఆ పార్టీ నాయకుడు మంతపురి రాజుగౌడ్ ఆధ్వర్యంలో పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లో స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో కాలేరు సింధుతపస్వీ, హర్షవర్ధన్, సంగ్లోత్ రంజిత్, కిరణ్, పూజాల ప్రసాద్, అఖిల్ మహర్షి పాల్గొన్నారు.

ఇల్లెందు: మాట్లాడుతున్న హరిప్రియానాయక్

పాల్వంచలో స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

రికార్డులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

బూర్గంపహాడ్, అక్టోబర్ 30: గురుకులం విద్యార్థులు క్రమశిక్షణతో చదివి లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆకాంక్షించారు. మండలంలోని కృష్ణసాగర్ గురుకుల కళాశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, డార్మెటరీ, డైనింగ్ హాల్, వంట గది, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాబోధనపై విద్యార్థులను ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఇష్టమైన క్రీడల్లో తర్ఫీదు ఇవ్వాలని అధ్యాపకులతో చెప్పారు.

గంజాయి పట్టివేత

పట్టుబడిన నిందితుడిని, గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

భద్రాచలం, అక్టోబర్ 30: భద్రాచలంలో 118 కిలోల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కరంచంద్ తెలిపిన వివరాలు... భద్రాచలంలోని కూనవరం రోడ్‌లో ఆర్‌టీఏ చెక్‌పోస్ట్ వద్ద ఎక్సైజ్ పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అటుగా వచ్చిన రెండు ఆటోలను ఆపారు. వాటిని తనిఖీ చేస్తుండగా, ఒక ఆటోలోని వ్యక్తి పరారయ్యాడు. ఆ ఆటోలను నడుపుతున్న బాలుడిని, యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువకుడిని హైదరాబాద్‌కు చెందిన కనిగల సాత్విక్‌గా, బాలుడిని మణుగూరుకు చెందిన వాడిగా గుర్తించారు. పరారైన వ్యక్తి మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం ప్రాంతానికి చెందిన చెందిన సపావత్ వెంకన్న అని, అతడు ఇల్లెందులో ఉంటున్నాడని పట్టుబడిన బాలుడు చెప్పాడు. బాలుడిని, కనగల సాత్విక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు ఆటోల నుంచి మొత్తం 118 కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. వీటిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. వీటి విలువ రూ.31.50లక్షలు ఉంటుందని అంచనా. గంజాయిని, నిందితులను పట్టుకున్న బృందంలో ఎక్సైజ్ ఎస్సై గౌతమ్, సిబ్బంది రామకృష్ణ గౌడ్, హబీబ్‌పాషా, వెంకటనారాయణ, గురవయ్య, సుమంత్, శ్రావణి, రమేష్ ఉన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 30 : జిల్లా మెడికల్ కాలేజీలో అవినీతికి పాల్పడిన వారిపై విచారణ జరిపి కఠినచర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ ఏజెన్సీలను రద్దు చేసి కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేశాక పోస్టులు భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. గత ఏడాది మెడికల్ కాలేజీలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ చేసిన విషయం అందరూ మరువక ముందే మళ్లీ వైద్య కళాశాలలో రెడ్‌హ్యాండెడ్‌గా ఏవో, జూనియర్ అసిస్టెంట్‌లు పట్టుబడ్డారని, వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు.

మావోయిస్టు పార్టీ సభ్యురాళ్ల లొంగుబాటు

లొంగిపోయిన మావోయిస్టుల పార్టీ సభ్యుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 30 : మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు దళ సభ్యురాళ్లు జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు బుధవారం పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర కమిటీలో సభ్యురాళ్లుగా పనిచేస్తున్న ఏరియా కమిటీ సభ్యురాలు (ఏసీఎం) సోడి పొజ్జి అలియాస్ చిలుక, మరో ఏసీఎం మడివి సోమిడి అలియాస్ రమ్య తమ పార్టీ సిద్ధాంతాలపై అసంతృప్తి చెంది స్వేచ్ఛాయుత జీవనాన్ని గడిపేందుకు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారంలోని డోకుపాడుకి చెందిన పొజ్జి నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు(బీకే-ఏఎస్ఆర్) డివిజన్లోని చర్ల ఎల్ఓఎస్ కమాండర్‌గా పనిచేస్తోంది. పొజ్జి 2017లో తన సోదరుడైన సోడి జోగయ్య ప్రోద్బలంతో చర్ల ఎల్ఓఎస్‌లో దళ సభ్యురాలిగా చేరి, 2021లో ఏరియా కమిటీ మెంబర్‌గా పదోన్నతి పొందింది. 2023 వరకు మావోయిస్టు పార్టీ చైతన్య నాట్య మండలి(సీఎన్ఎం) కమాండర్‌గా పని చేసింది. చర్ల కమాండర్‌గా పని చేసిన మడకం ఎర్రయ్య అలియాస్ రాజేష్ మృతిచెందాక పొజ్జి అతడి బాధ్యతలు స్వీకరించింది. సుక్మా జిల్లా డోకుపాడు గ్రామానికి చెందిన రమ్య 2019వ సంవత్సరంలో చర్ల మిలీషియా కమాండర్ సోడి జోగయ్య అధ్వర్యంలో మావోయిస్టు పార్టీలో చేరింది. 2021వ సంవత్సరంలో మణుగూరు ఎల్‌జీఎస్‌కు రమ్యని బదలీ చేశారు. అనంతరం 2024లో ఏరియా కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొంది, మణుగూరు ఏరియా ఎల్‌జీఎస్ కమాండర్‌గా కొనసాగింది. సదరు ఇద్దరు మావోయిస్టు పార్టీ సభ్యురాళ్లు దళ సభ్యులుగా చేరి ఏరియా కమిటీ సభ్యులుగా పదోన్నతి పొందిన వీరిలో ఒకొక్కరిపై రూ.4 లక్షల రివార్డు ఉందని ఎస్పీ పేర్కొన్నారు.

పాఠశాలల్లో దీపావళి వేడుకలు

పాల్వంచ, అక్టోబర్ 30 : పాల్వంచ పట్టణంలోని శ్రీచైతన్య, త్రివేణి పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు మట్టి, గోధుమపిండి, క్లే ఉపయోగించి ప్రమిదలను తయారు చేసి వాటిని రంగులతో అలంకరించారు. రంగురంగుల కాగితాలతో గ్రీటింగ్‌కార్డులను, రకరకాల డిజైన్లతో పేపర్ లాంటర్లను తయారు చేశారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలను ప్రదర్శించారు. కృష్ణుడు, సత్యభామ, నరకాసుర వేషధారణను ధరించారు. కార్యక్రమాల్లో శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం జయప్రకాష్, హెచ్ఎం మిర్యాలరాణి, టీచర్లు, త్రివేణి పాఠశాల ప్రిన్సిపాల్ నేతాజీ, వైస్ ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు. డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, సీఆర్‌వో మురళీకృష్ణ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

జాబ్‌మేళాలో పాల్గొన్న విద్యార్థులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 30 : ప్రియదర్శిని కళాశాలలో బుధవారం జెన్ ప్యాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 2021-22, 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో బికాం, బీఎస్సీ, బీసీఏతోపాటు బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు సుమారు 448మంది జాబ్‌మేళాకు హాజరయ్యారు. జెన్ ప్యాక్ట్ ప్రతినిధులు మూడు రౌండ్లలో పరీక్షలు నిర్వహించి 32మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు, డైరెక్టర్ చలపతిరావు, ప్రిన్సిపాల్ నయీంపాషా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటఫణి పాల్గొన్నారు.

మణుగూరులో 83 శాతం బొగ్గు ఉత్పత్తి

మణుగూరు టౌన్, అక్టోబర్ 30: సింగరేణి మణుగూరు ఏరియా అక్టోబర్‌లో నిర్దేశిత 11.16 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికిగాను 9.30 లక్షల టన్నులు (83 శాతం) సాధించినట్లు జీఎం దుర్గం రాంచందర్ చెప్పారు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 30 వరకు నిర్దేశిత 69.81 లక్షల టన్నులకుగాను 61 లక్షలు ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. ఓబీ తొలగింపులో 15 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికిగాను 13 లక్షల 5వేల క్యూబిక్ మీటర్లు (87 శాతం) తీసినట్లు వివరించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 96 లక్షల క్యూబిక్ మీటర్లకుగాను 71 లక్షల క్యూబిక్ మీటర్లు సాధించినట్లు తెలిపారు. ఉత్పత్తి లక్ష్య సాధనలో ఇప్పటి వరకు కొంత వెనుకబడి ఉన్నామని అన్నారు. సమష్టి కృషితో వార్షిక నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి తీరుతామని విశ్వాసం వ్యక్తం చేశారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 30 : విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బుధవారం కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగకృష్ణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామ్‌చరణ్, నహీద్ పాషా, గణేష్ పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో అవగాహన వారోత్సవాలు

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాల్వంచ, అక్టోబర్ 30 : పాల్వంచలోని కేటీపీఎస్ ఏడోదశలో నిఘా అవగాహన వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సీఈ పాలకుర్తి వెంకటేశ్వరరావు ఏడో దశ ఉద్యోగులతో కలిసి సర్వీస్ బిల్డింగ్ నుంచి అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ వరకు ర్యాలీ చేశారు. ప్ల కార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ అవినీతి నిర్మూలనకు సంబంధించిన నినాదాలు చేశారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఇంజినీర్లు శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, యుగపతి, కేటీపీఎస్ విజిలెన్స్ డీఎస్పీ రమేష్, ఎస్‌పీఎఫ్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ రత్నారావు పాల్గొన్నారు.

'స్కాలర్‌షిప్ ఇచ్చేంత వరకు పోరాడుతాం'

వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

పాల్వంచ, అక్టోబర్ 30 : స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేసేంత వరకు పోరాడుతామని భారత విద్యార్థి ఫెడరేషన్ పాల్వంచ మండల కమిటీ అధ్యక్షుడు గిర్దావర్ రవికుమార్‌కు విద్యారంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ కమిటీ అధ్యక్షుడు రాంచరణ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంటర్మీడియట్, పారామెడికల్ కాలేజీల యాజమాన్యాలు స్వయంగా కళాశాల బంద్ పెట్టి ఆందోళన చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రపోతుందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మందా నాగకృష్ణ, నాగబాబు, అఖిల్ పాల్గొన్నారు.

చోరీ సామాన్లు కొనవద్దు

దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై స్వప్న

చండ్రుగొండ, అక్టోబర్ 30: చోరులు తీసుకొచ్చిన పాత సామాన్లను, ఇనుప వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనవద్దని పాత సామాన్ల దుకాణాదారులను ఎస్సై జి.స్వప్న హెచ్చరించారు. చండ్రుగొండ గ్రామంలోని పాత సామాన్ల కొనుగోళ్ల దుకాణాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. వాటి యజమానులతో మాట్లాడుతూ... ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ పాత సామాన్లు అమ్మే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితుల నుంచి వస్తువులు కొనేటప్పుడు అడ్రస్ ప్రూఫ్ అడగాలన్నారు. అడ్రస్ ప్రూఫ్ ఇవ్వకపోతే కొనవద్దని, అవసరమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సంక్షిప్తం

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, అక్టోబర్ 30: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు బుధవారం నిత్య కల్యాణ మూర్తులకు కల్యాణం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

బోనస్ చెల్లించాలి

టేకులపల్లి, అక్టోబర్ 30: కోయగూడెం ఉపరితల గనిలోని 48 మంది కాంట్రాక్ట్ కార్మికులకు బకాయి బోనస్‌ను యాజమాన్యం వెంటనే చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన చేశారు.

వేతనాల పెంపుపై హర్షం

టేకులపల్లి, అక్టోబర్ 30: కోయగూడెం ఉపరితల గని నుంచి బొగ్గు సరఫరా చేస్తున్న టిప్పర్ డ్రైవర్ల వేతనాలు పెంపుపై ప్రగతిశీల మోటర్, ఆటో వర్కర్స్ యూనియన్(ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. టిప్పర్ డ్రైవర్లతో వారు బుధవారం టేకులపల్లిలో సమావేశమయ్యారు.

రుణం అందజేత

టేకులపల్లి, అక్టోబర్ 30: స్థానిక బేతంపూడి సొసైటీ కార్యాలయంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి రుణాన్ని చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు బుధవారం అందజేశారు. కార్యదర్శి ప్రేమాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఐకి సన్మానం

బూర్గంపహాడ్, అక్టోబర్ 30: భద్రాచలం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ)గా సంగం వెంకటపుల్లయ్య విధుల్లో చేరారు. మండలంలోని మోరంపల్లి బంజర్ గ్రామస్తులు బుధవారం ఆయనను తన కార్యాలయంలో సన్మానించారు.

వైద్య శిబిరం

దుమ్ముగూడెం, అక్టోబర్ 30: మండలంలోని ఏకలవ్య వసతి గృహంలో బుధవారం వైద్య శిబిరాన్ని పీహెచ్‌సీ డాక్టర్లు పుల్లారెడ్డి, నాగరాజు నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎం దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌నగర్‌లో నీటి కటకట

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న అంబేద్కర్‌నగర్ మహిళలు

చుంచుపల్లి, అక్టోబరు 30 : మండల పరిధిలోని 4 ఇంక్లైన్ పంచాయతీ అంబేద్కర్‌నగర్‌లో మంచినీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 60 ఇండ్లకు మిషన్ భగీరథ ట్యాంకు ద్వారా నీరు సరిగా అందడం లేదు. అధికారులు స్పందించి నీటిని సరఫరాచేసి తమ బాధలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా పాతలైను నుంచి నీరు సరిగా రావడం లేదని మరో లైను వేసి నీరు ఇస్తామని తెలిపారు.

కుటుంబ సర్వేపై శిక్షణ

దుమ్ముగూడెం/మణుగూరు టౌన్/అశ్వారావుపేట టౌన్/అన్నపురెడ్డిపల్లి/ఇల్లెందు, అక్టోబర్ 30: నవంబర్ 6వ తేదీ నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్యూమరేటర్లకు బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని దుమ్ముగూడెం, మణుగూరు, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి, ఇల్లెందు తహసీల్దారులు/ఎంపీడీవోలు నిర్వహించారు

కాంగ్రెస్‌లో వర్గ పోరు

దుమ్ముగూడెం, అక్టోబర్ 30: ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు విషయమై ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు (ఈయన బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లారు), మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య వర్గీయుల మధ్య పోరు సాగుతున్నది. వివిధ గ్రామాల్లోని కమిటీలలో తమ పేర్లు లేవంటూ పొదెం వీరయ్య వర్గీయులు బహిరంగంగానే అభ్యంతరాలు, ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

బీమా పథకాలపై అవగాహన

పినపాక(కరకగూడెం), అక్టోబర్ 30: పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై తదితర బీమా పథకాలపై ఏపీజీవీబీ కరకగూడెం బ్రాంచ్ మేనేజర్ ఎన్.గిరిబాబు బుధవారం డ్వాక్రా మహిళలకు, ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఐకేపీ వీవోఏలు పాయం లక్ష్మినారాయణ, నర్సింగ్ వెంకన్న, ముత్యాల రమాదేవి, ఎఫ్ఎల్‌సీ కోఆర్డినేటర్ కొమరం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల విడుదలకు వినతి

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 30: ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బయ్యా అభిమన్యు బుధవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం ఇచ్చారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం

పాల్వంచ రూరల్, అక్టోబర్ 30 : మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో బుధవారం రుద్ర హోమం నిర్వహించారు. ఉదయం మేళతాళాలతో వేద మంత్రాలతో ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి యాగశాలకు తీసుకొచ్చారు. మండపారాధన, గణపతి హోమం కార్యక్రమాల అనంతరం రుద్రహోమం జరిపారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కుటుంబ సమేతంగా పెద్దమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు.

ముగిసిన మహాయాగం

పాల్వంచ, అక్టోబర్ 30 : యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా దేశ అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరపున పోటీ చేస్తున్న కమల హ్యారీస్ అత్యధిక మెజార్టీతో గెలవాలని కోరుతూ శ్యామలాగోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లా సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ రాజశ్యామలాంబదేవి మాలా మంత్ర జపయజ్ఞ పూర్వక శతచండీ సహిత మహా యాగం చేపట్టారు. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు ఈ పూర్ణాహుతి మహాచండీ సహిత మహాయాగం బుధవారం ముగిసింది.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE
★గజం: **2,500/- నార్కెట్‌పల్లి దగ్గర** గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616